
సాక్షి ఒడిశా

గురువారం । 30 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,92,557
బంగారం	3 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి	31 గ్రాముల 250 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఘనంగా బలిజాత్ర

జయపురం సమితిలోని జయంతిగిరిలో బలిజాత్ర మంగళవారం ఘనంగా జరిగింది.

- 8లో.



చురుకుగా రథాల తయారీ

శ్రీజగన్నాథుని రథయాత్ర సన్నాహాల్లో అత్యంత ప్రధానమైనది రథాల తయారీ. గత 19 రోజులుగా ఈ పనులు చకచకా సాగుతున్నాయి.

- 8లో.

న్యూస్‌రీల్

బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



ఆశ్రమ విద్యార్థులతో క్లబ్ సభ్యులు, నిర్వాహకురాలు నళిని

రాయగడ: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలోని రైతుల కాలనీలో నవజీవన్ ట్రస్ట్‌లో ఉన్న అనాథ ఆదివాసీ విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన నర్సులు ఈ పరీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని క్లబ్ సభ్యులకు ధన్యవాదాలను తెలియజేశారు. క్లబ్ సభ్యుడు దుష్మంత్ కుమార్ మాహంతి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా తమ క్లబ్ ప్రథమంగా ఒక అనాథ ఆశ్రమ విద్యార్థులకు ఇటువంటి తరహా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ఐసీయూలో ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్

- ఈవీఎం పగలుగొట్టిన ఆరోపణలో జైలులో ఉన్న ఎమ్మెల్యే



భువనేశ్వర్: చిలికా శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రశాంత్ కుమార్ జగదేవ్‌ను కటక్ ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రి (ఎంసీహెచ్)లో చేర్చారు. ఈనెల 25న బెగునియా శాసనసభ నియోజకవర్గం పరిధిలోని బొలాగొడా మండలం కంపురియాపట్న ఉన్నత ప్రాథమిక పాఠశాల 114వ నంబర్ బూత్ వద్ద ఈవీఎంను పగలుగొట్టి, పోలింగ్ సిబ్బందిపై దాడి చేసిన ఆరోపణల కింద ఖుర్దా నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయనను అరెస్టు చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. జైల్లో అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆస్పత్రిలో చేర్చారు. కటక్ ఎస్‌సీబీ ఎంసీహెచ్ మెడిసిన్ వార్డులోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. తీవ్రమైన మధుమేహం, వెన్నెముక సంబంధించిన సమస్యల కారణంగా ఆయన ఆస్పత్రి పాలయ్యారని ఆయన తరుపు న్యాయవాది మీడియాకు తెలిపారు.

షుగర్ లెవల్స్ పెరగడంతో....

బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగడంతో ఐసీయూలో ఉంచినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అతనికి నిరంతరం ఇన్సులిన్ ఇస్తున్నారు. కార్డియాలజీ, ఎండోక్రినాలజీ, మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. ఆయనపై నమోదైన కేసులో త్వరితగతిన దర్యాప్తు చేయాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిన ఒక రోజు తర్వాత నిందిత ఎమ్మెల్యే ఆస్పత్రిలో చేరడం చర్చనీయాంశమైంది. మంగళవారం బీజేపీ నాయకురాలు, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి ఈవీఎం కూల్చివేత సంఘటనలో ప్రశాంత కుమార్ జగదేవ్ పాత్ర లేదని అన్నారు. అందుకు ఆధారంగా ఆమె పోలింగ్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని తన ఫేస్‌బుక్ ఖాతాలో ప్రసారం చేశారు. ఈ ప్రసారంపై భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వైరల్ వీడియోపై విచారణ జరిపి, విషయాన్ని స్పష్టం చేయాలని ఖుర్దా జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ)ని ఆదేశించారు.

ముగిసిన నీలమ్మ ఉత్సవాలు



గజనెయ్యి ముద్ద అమ్మవారు

పర్లాకిమిడి: స్థానిక మూడో నంబర్ వార్డు కొత్త కాపువీధిలో నిర్వహిస్తున్న గ్రామదేవత నీలమ్మ అమ్మవారి పండుగ సంబరాలు బుధవారం ముగిశాయి. గజనెయ్యి ముద్దతో చేసిన అమ్మవారిని వేకువ జామున కాలేజీ రోడ్డు వరకూ డప్పుల చప్పుళ్లతో ఊరేగించి నీలమ్మ గుడిలో అనుపోత్సవం చేశారు.

నాటుసారా బట్టీలపై దాడులు




నాటుసారా సామగ్రి స్వాధీనం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: సమితి పరిధి ములసర గ్రామంలో నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా 100 లీటర్ల నాటుసారా, 1,500 లీటర్ల ఇప్పఊట ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు రూ.95 వేలు ఉంటుందని వెల్లడించాను. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ విభాగ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు.

ఆలివ్ రిడ్లేపై రిమల్ ప్రభావం

- ధ్వంసమైన గుడ్లు
- తాబేళ్ల పిల్లల ఆవిర్భావానికి అంతరాయం





భువనేశ్వర్: రీమల్ తుఫాన్ ప్రభావం రాష్ట్రంపై పెద్దగా లేకున్నా, రాష్ట్రంలో పేరొందిన గహీర్‌మఢ్ తాబేళ్ల సంతతి తీరంపై తీవ్ర ప్రభావం చూపించింది. నాసి–2 వద్ద అనేక ఆలివ్ రిడ్లే సామూహిక పొదిగే గూడులను రీమల్ తుఫాన్ నాశనం చేసిందని రాజ్‌నగర్ మడ అడవులు (అటవీ) మరియు వన్యప్రాణుల విభాగం డీఎఫ్‌వో సుదర్శన్ గోపీనాథ్ జాదవ్ తెలిపారు. రీమల్ తుఫాన్ కారణంగా అల్లకల్లోలంగా ఉన్న సముద్రం, అధిక ఆటుపోట్లుతో అనేక ఆలివ్ తాబేలు గుడ్లు కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గుడ్లు ధ్వంసం

ఈ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి తాబేలు గుడ్లు పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయి. అధికారిక వర్గాల ప్రకారం రీమల్ తుఫాన్‌కు కేవలం మూడు రోజుల ముందు నాసి–2 సామూహిక గూడు ప్రదేశాల్లో గుడ్ల నుంచి సుమారు 1.20 లక్షల ఆలివ్ రిడ్లీ సముద్రపు తాబేళ్లు బయటపడ్డాయి. అయితే తుఫాన్ వాతావరణం ప్రభావంతో గుంతల నుంచి పిల్లలు బయటకు రావడం ఆగిపోయిందని వివరించారు. దాదాపు 3 లక్షల ఆలివ్ రిడ్లే సముద్ర తాబేళ్లు గహీర్‌మఢ్ సముద్ర అభయారణ్యంలోని నాసి–2 గోల్డెన్ బీచ్‌కు వచ్చి, ఏప్రిల్ 2 నుండి 5 రోజుల పాటు గుడ్లు పెట్టాయని జాదవ్ చెప్పారు. సముద్ర తాబేళ్ల భారీ గూడు ప్రక్రియ కూడా ప్రతికూల ప్రభావంతో ధ్వంసమైంది. అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే సముద్ర తాబేళ్ల పిల్లలు ఆరు రోజుల క్రితం గహీర్‌మఢ్ సముద్ర అభయారణ్యం పరిధిలోని వీలర్స్ ద్వీపం సమీపం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కి దగ్గరగా ఉన్న నాసి–2 వద్ద గూడు కట్టుకునే ప్రదేశంలో ఉద్భవించాయి. తదుపరి 5 రోజులు ఈ ప్రక్రియ కొనసాగుతుందని భావించారు. కానీ రీమల్ తుఫాన్‌తో గుడ్లు చెదిరి పోవడంతో తాబేళ్ల పిల్లల ఆవిర్భావానికి అంతరాయం కలిగించింది.

ముగిసిన సములాయి దుర్గ జాతర



ఘటాలు తీసుకెళ్తున్న మహిళలు

రాయగడ: స్థానిక పాయికోవీధిలో గత ఐదు రోజులుగా జరుగుతున్న సములాయి దుర్గ జాతర బుధవారంతో ముగిసింది. దీనిలో భాగంగా అమ్మవారి ప్రధాన ఘట్టమైన నిప్పులపై(మల్లెలు) పూజారి నడిచే ఘట్టం మంగళవారం రాత్రి జరిగింది. దీనిని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పూజారి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం అగ్నిదేవునికి ఆహ్వానించి నిప్పులను వెలిగిస్తారు. దీంతో మండుతున్న అగ్గి నిప్పులపై అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు, పాలజంగిడి మోసేవారు నడుస్తారు. దీనినే మల్లెలు తొక్కే కార్యక్రమంగా పిలుస్తారు. అనంతరం బుధవారం అమ్మవారి ఘటాలు, ప్రత్యేకంగా రూపొందించిన కాళీమాత బొమ్మను ఊరేగింపుగా మజ్జిగౌరి మందిరానికి తీసుకెళ్లి పూజిస్తారు. అదేవిధంగా మందిరానికి సమీపంలోని పాదాల గుడివద్ద ఘటాలను నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది.



కాళీమాత బొమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ



జయపురం: శిక్షణ పొందుతున్న ఎన్నికల సిబ్బంది



రాయగడ: శిక్షణ శిబిరంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

జయపురం: జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపుపై స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లకు శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి, కొరాపుట్ ఏడీఎం అలోమణి సెట్టి, జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జయపురం తహసీల్దార్ డా.మనోలిస ఆచారి, బొరిగుమ్మ తహసీల్దార్ అమ్రిత లాల్ బెహర, కోట్‌పాడ్ తహసీల్దార్ కీర్తిచంద్ర ప్రధాన్, కుంద్ర తహసీల్దార్ వినోద నాయిక్, జయపురం అదనపు బీడీవో మనోజ్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: ఈనెల 14వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని గుణుపూర్, రాయగడ, బిసంకటక్ శాసనసభలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానాలకు సంబంధించి జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి అధికారులు, సిబ్బందికి స్థానిక రాయగడ కళాశాల సమావేశ హాల్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరొ, రాయగడ సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్‌ల నేతృత్వంలో శిబిరం చేపట్టారు. దీనిలో భాగంగా లెక్కింపు సమయంలో కౌంటర్ల వద్ద ఈవీఎంలను ఎలా తెరవాలి, ఎలా లెక్కించాలి, రౌండ్‌ల వారీగా వివరాలను ఏవిధంగా తెలియజేయాలి అనే అంశంపై చర్చించారు. రాయగడ శాసనసభ నియోజకవర్గం గురించి స్థానిక భారిజోల వద్దనున్న ప్రాథమిక పాఠశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. బిసంకటక్ శాసనసభ గురించి స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల వద్ద, అలాగే గుణుపూర్ విధానసభ స్థానం గురించి గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఓట్ల లెక్కిపు జరుగుతుందని తెలియజేశారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి సస్పెండ్



డి.ఎస్.కుట్టే

భువనేశ్వర్: ఎన్నికల యంత్రాంగంపై అనుచిత ప్రభావం చూపినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి డి.ఎస్.కుట్టేని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సస్పెండ్ చేసింది. ఎన్నికల నిర్వహణలో అనవసరంగా జోక్యం చేసుకున్న ఆరోపణ కింద ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)కి ఈసీఐ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఈనెల 4వ తేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ జనరల్ (ముఖ్యమంత్రి భద్రత) ఆశిష్ కుమార్ సింగ్‌కి వ్యతిరేకంగా కూడా భారత ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ బోర్డు ఏర్పాటు చేసింది. దీర్ఘకాలంగా సెలవులో కొనసాగుతున్న ఆశిష్ కుమార్ సింగ్ సంపూర్ణ వైద్య పరీక్షలకు ఈ బోర్డు ముందు హాజరు కావాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

భారీగా గుట్కా స్వాధీనం



భద్రయ్య వీధిలో దాడులు జరుపుతున్న సిద్ధార్థ పట్నాయక్ తదితరులు

జయపురం: పట్టణంలో గుట్కా వ్యాపారులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించి భారీగా గుట్కా సామగ్రి పట్టుకున్నారు. మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పటాన్నయక్ నేతృత్వంలో కాపువీధిలోని జగత్ జననీ డిస్ట్రిబ్యూటర్స్, భద్రయ్య వీధిలోని అమన్ ఏజెన్సీకి చెందిన రెండు గోదాములపై పట్టణ పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించారు. అమన్ ఏజెన్సీ గోదాముల్లో 416 ప్యాకెట్ల గుట్కా, 11 ప్యాకెట్ల జర్దా జప్తు చేశారు. అంతేకాకుండా మరో రెండు దుకాణాలపై నిర్వహించిన దాడుల్లో 40 ప్యాకెట్లకు పైగా గుట్కా పట్టుబడినట్లు వెల్లడించారు. ఆ రెండు దుకాణాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అమన్ ఏజెన్సీకి రూ.50 వేల జరిమానా విధించారు. అదేవిధంగా జగత్ జననీ డిస్ట్రిబ్యూటర్స్‌లో 38 ప్యాకెట్ల గుట్కాతో పాటు 310 కేజీల పాలిథిన్, డిస్పోజబుల్ గ్లాసులు మొదలగునవి పట్టుకున్నారు. వారికి రూ.20 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. జగత్ జననీ డిస్ట్రిబ్యూటర్‌కు కూడా ట్రేడ్ లైసెన్స్ లేదని వెల్లడించారు. ఇక ముందు కూడా ఇటువంటి దాడులు విస్తృతంగా నిర్వహిస్తామని, ఎవరైనా అక్రమంగా విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఒక షాపులో బయటపడిన గుట్కా బస్తాలు

వెదురు అక్రమ రవాణా



వెదురును ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నియమగిరి అడవుల నుంచి అరుదుగా ఉండే వెదురును కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. పర్శాలి అటవీ రేంజ్ పరిధిలోని తెంతులిపొదొరొ, నారింగితొల, చాటికొన, కుమసుముయి, బెంబారి, తతిముయి, బుడుణి, పాతలొంబ, భలేరి, కనసూరి తదితర అడవుల్లో వెదురును యథేచ్ఛగా నరికి లారీలు, ట్రాక్టర్లలో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు తరలిస్తున్నట్లు సమాచారం. అక్రమ రవాణా విషయంలో పూర్తి సమాచారం ఉన్నప్పటికీ అటవీ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు నియమగిరి ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ అడవుల్లో వెదురు అంతరిస్తుండగా ఉన్నవాటిని సంరక్షించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటిని నరికి రవాణా చేస్తున్నవారికి అధికారులు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలో వెదురుతో రూపొందించే చేతివృత్తి పనులవారు వెదురు లభించక ఎన్నోపాట్లు పడుతున్న నేపథ్యంలో ఈ మాఫియాల ఆగడాలను నివారించాలని కోరుతున్నారు. వెదురుతో రూపొందించే కళాకృతులను తయారు చేసేందుకు అడవుల నుంచి రెండు మూడు వెదురు కర్రలను తీసుకువస్తే కోపగించేకునే అటవీ శాఖ అధికారులు, ఇలా అక్రమదారులు యథేచ్ఛగా రవాణా చేస్తున్నా పట్టించుకోకపోవడంతో తీవ్ర సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కల్యాణ సింగుపూర్ రేంజర్ చందన్ గొమాంగోను ఈ విషయమై ప్రశ్నించేందుకు ప్రయత్నించినా ఆయన నుంచి ఎటువంటి సమాధానం లభించలేదు. ఇప్పటివరకు ఉన్నతాధికారులు వెదురు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిప్పుల కుంపటిలా పర్లాకిమిడి







రోహిణి కార్తె ఎండల ప్రభావం వలన పర్లాకిమిడిలో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. పట్టణంలో బుధవారం 43 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌లో పనుల నిమిత్తం విచ్చేసిన ఆదివాసీ మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 10 గంటలకే ఎండ ప్రభావంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఎండల ధాటికి బోసిపోయాయి. దూరప్రాంత ప్రయాణాలు చేసేవారు మొఖంపై తడి గుడ్డలు వేసుకుని మోటారు బైక్‌లపై వెళ్లడం కనిపించింది. దీనికి తోడు కరెంటు కోతలు ఉండడంతో పట్టణంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

– పర్లాకిమిడి

అభ్యర్థులతో అధికారుల సమావేశం



సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి అలోక్ పండా

పర్లాకిమిడి: జూన్ 4వ తేదీన స్థానిక ఎస్‌కేసీజీ కళాశాలలో జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు గజపతి జిల్లాలోని పర్లాకిమిడి, మోహనా అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్లుతో సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అలోక్ పండా బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి, కాంగ్రెస్ అభ్యర్థి బిజయ కుమార్ పట్నాయక్ తరపున బసంత్ పండా, బీజేపీ తరపున పృథ్వీరాజ్ చౌహాన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పైల మురళీకృష్ణ, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, జెడ్పీటీసీ బాలరాజు తదితరులు హాజరయ్యారు. దీనిలో భాగంగా రిటర్నింగ్ అధికారి అలోక్ పండా కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులకు పలు సూచనలు చేశారు.

- కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభవుతున్న దృష్ట్యా అభ్యర్థులు లేదా ఏజెంట్లు ఏడు గంటలకే కౌంటింగ్ కేంద్రంకు విచ్చేయాలి. వారి సమక్షంలోనే ఈవీఎంలు, వీవీ ప్యాట్ల స్ట్రాంగ్ రూమ్‌లు తెరుస్తారు.
- అలాగే పోస్టల్ బ్యాలెట్స్ ట్రెజరీలో డిపాజిట్ చేశామని, వాటిని అభ్యర్థుల సమక్షంలో కళాశాల కౌంటింగ్ కేంద్రానికి తీసుకొస్తామన్నారు.
- పర్లాకిమిడి నియోజకవర్గానికి 28 రౌండ్లు, మోహనా అసెంబ్లీ సెగ్మెంట్‌కు 30 రౌండ్లు ఉంటాయని, ఒక్కొక్క రౌండ్‌కు పది టేబుల్స్ ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.
- ప్రతీ టేబుల్‌లో ఈవీఎంల లాక్‌లు తెరచి ఆన్ చేసిన తర్వాత ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో నిర్ధారణకు ఒక షీట్ ఉంటుందని, వాటిపై అభ్యర్థులు ప్రత్యేకంగా సంతకం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
- కౌంటింగ్ ప్రారంభమైన గంట తర్వాత కళాశాల ఓపెన్ మైదానంలో పెద్ద తెరపై ఫలితాలు ప్రకటిస్తామన్నారు.
- ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్స్ ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు.



ఏజెంట్లుకు ఫారం 18ఏ అందజేస్తున్న అధికారులు

- పార్లమెంటరీ స్థానం కోసం అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్లు నియామకానికి జూన్ 1 లోగా బరంపురంలో ఫారం 18ఏ దాఖలు చేసుకోవాలన్నారు. అదే అసెంబ్లీ సెగ్మెంట్స్ అయితే ఏజెంట్లు జూన్ ఒకటిలోగా పర్లాకిమిడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో 18ఏ ఫారం దాఖలు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్

అరసవల్లి: సూర్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని రాష్ట్ర అటవీ, ఇంధన, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ కుటుంబసమేతంగా బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరిస్తూ.. నీరబ్ కుమార్ కుటుంబ సభ్యుల గోత్రనామాలతో విశేష పూజలు చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీకూర్మనాథుడిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు వివరాలు తెలిపారు. బూరగాం గ్రామానికి చెందిన బుడ్డ మోహిని గ్రామాల్లో తిరుగుతూ వివిధ రకాల పప్పులు అమ్ముకొని జీవనం గడుపుతుండేది. ఎప్పటి లాగే మంగళవారం ఇంటినుంచి బయలుదేరి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న కోళ్ల తీసుకెళ్లే వాహన డ్రైవర్‌తో మాట్లాడుతుండగా, ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్లే అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ అతివేగంగా వచ్చి, ఆగి ఉన్న కోళ్ల వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న వాహనం కదిలి బూర గాం గ్రామానికి చెందిన బుడ్డ మోహినిని ఢీకొట్టడంతో ఆమె తలకు, ఛాతీకి తీవ్రగాయాలయ్యాయి. ఆమెతోపాటు ప్రమాదానికి కారణమైన వాహనంలో ప్రయాణిస్తున్న కాకినాడ దగ్గరలో గల పెద్దాపురం మండలం గోరంట్ల గ్రామానికి చెందిన డ్రైవర్ కలగ నానికి స్వల్ప గాయాలవ్వగా, పక్కన ఉన్న మరోవ్యక్తి నాయుడు జయ బాబుకు కాళ్లు విరిగాయి. దీంతో వీరిని హుటాహుటిన సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. తీవ్రగాయాలపాలైన మోహినిని అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జెమ్స్‌కు తరలించారు. మోహిని సోద రుడు బుడ్డ గణేష్ ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెజ్జిపురంలో చోరీ



ఓపెన్ చేసి ఉన్న చెక్క బీరువా

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామంలో పదహారున్నర తులాల బంగారు వస్తువులు, రూ.17 వేలు నగదు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే బెజ్జిపురం గ్రామానికి చెందిన తాళ్లాబత్తుల సూరిబాబు తన కుటుంబంతో కలిసి ఎస్.కోటలోని కూతురి ఇంటికి సోమవారం వెళ్లి తిరిగి బుధవారం వచ్చారు. ఇంటి తలుపు తీసి చూడగా ఇంటి వెనుక డోర్ తీసి ఉంది. పైన ఉన్న రూము డోర్ కూడా తీసి ఉండటంతో పాటు చెక్క బీరువా పగలగొట్టి ఉంది. అందులో ఉన్న బంగారు వస్తువులు, నగదు కనిపించకపోవడంతో సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లావేరు ఎస్ఐ సీహెచ్ స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: చదువుతో పాటు విద్యార్థులకు విజ్ఞానం కూడా అవసరమని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు సమాజం అంటే ఏమిటి, సమాజంలో ఎలా వ్యవహరించాలో రిసోర్స్ పర్సన్ తిరుపతిరావు విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు సులభంగా గణితం చేయటంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పీవీ భాస్కరరాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

సుధిష్ణకు గ్లోబల్ ఐకాన్ అవార్డు



అవార్డుతో మల్యాడ సుధిష్ణ

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడుకు చెందిన జెస్సీ జానపద నృత్య కళాకారుల జట్టు సభ్యురాలు మల్యాడ సుధిష్ణకు గ్లోబల్ ఐకాన్ అవార్డు వరించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఐకాన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సుధీష్ణ ప్రదర్శనకు మెచ్చి అవార్డు అందించారు. ఈమె స్వగ్రామం కంచిలి మండలం కొర్లాం గ్రామం. తల్లి నాగమణి పోస్టల్‌శాఖలో పనిచేస్తుండగా, తండ్రి ఈశ్వరరావు సెలూన్ షాప్ నడుపుతూ కుమార్తెను ప్రోత్సహిస్తున్నారు. సుధిష్ణకు అవార్డు దక్కడం పట్ల జెస్సీ జానపద కళాకారుల జట్టు అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు, ఉద్దాన ప్రాంత జానపద కళావేదికలు, కళాకారులు,కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



భంవురి జాతరలో రథ చక్రానికి పూజలు



రథం ఇరుసుతో సిద్ధమైన చక్రాలు



ఆజ్ఞామాలతో ఇరుసుకు అమరిన చక్రానికి మొక్కుతున్న సేవాయత్ ప్రముఖులు

చురుకుగా రథాల తయారీ

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని రథయాత్ర సన్నాహాల్లో అత్యంత ప్రధానమైనది రథాల తయారీ. గత 19 రోజులుగా ఈ పనులు చకచకా సాగుతున్నాయి. ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారం ఈ పనులను అంచెలంచెలుగా నిర్ధారిత సమయంలో పూర్తి చేయడంలో మహరణ, భొయి, కమ్మర సేవకులు తలమునకలై ఉన్నారు. తొలి దశలో చక్రాలు, ఇరుసు తయారీ ఒక స్థాయి పూర్తి కావడంతో బుధవారం చక్రాలను ఇరుసుతో అనుసంధానపరచడం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించే ఉత్సవం భంవురి జాతరగా స్థానికులు వ్యవహరిస్తారు.

భంవురి జాతర

రథాలను నడిపే చక్రాలను రథం ఇరుసులకు బిగించే ప్రక్రియ పురస్కరించుకుని బొడొ దండొలో బుధవారం భంవురి జాతర నిర్వహించారు. రథాల



ఆజ్ఞామాలలను తరలిస్తున్న అర్చక వర్గం

తయారీ పనులు పురస్కరించుకుని ప్రతి దశలో స్వామి ఆజ్ఞ పొందడం ఆచారం. ఈ క్రమంలో భంవురి జాతర నిర్వహణ కోసం శ్రీమందిరం రత్నవేదికపై కొలువుదీరిన మూల విరాటుల నుంచి ఆజ్ఞామాలలు రథ తయారీ శాల ప్రాంగణానికి చేరాయి. ఒక్కో రథానికి లాంఛనంగా ఒక్కో జత చక్రాలను ఇరుసుకు అమర్చి భంవురి జాతర ముగించారు. ప్రతి రథానికి వేర్వేరుగా ఆజ్ఞామాలలు బాజాబజంత్రీలు, మేళతాళాల మధ్య తరలించారు. సంప్రదాయం ప్రకారం బలభద్ర స్వామి రథం తాళ ధ్వజం ఇరుసుకు 2 చక్రాలను అమర్చారు. అనంతరం శ్రీజగన్నాథుని నంది ఘోష్ రథం, చివరగా దేవీ సుభద్ర రథం దర్పదళనం ఇరుసుకు చక్రాలను బిగించారు. ఈ సందర్భంగా ముందుగా చేరిన ఆజ్ఞామాలల్ని చక్రాలు అమరిన ఇరుసుకు పూజలు నిర్వహించారు. యాత్ర కోసం తయారు అవుతున్న మూడు రథాల కోసం సమగ్రంగా 42 చక్రాలు తయారు చేస్తారు. రథాల తయారీ 18వ రోజు పూర్తయ్యే నాటికి 16 చక్రాల నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటి తయారీలో దాదాపు 200 మంది వడ్రంగులు నిర్విరామంగా శ్రమించారు.



చక్రాలను ఇరుసుకు అమర్చుతున్న భొయి సేవకులు

ఘనంగా బలిజాత్ర



జయంతిగిరిలో బలిజాత్ర

జయపురం: సమితిలోని జయంతిగిరిలో బలిజాత్ర మంగళవారం ఘనంగా జరిగింది. అదేవిధంగా తెంతులికుంటి పంచాయతీ ఉమ్మిరి గ్రామంలో బలిజాత్ర వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ప్రజలు విత్తనాలు మొలకెత్తిన బుట్టలను బలి జాత్ర మైదానానికి తీసుకెళ్లి, అక్కడ భీమ, భీమాయిని దేవతలకు పూజలు జరిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటలు వేయాలో నిర్ణయించేందుకు ఈ జాత్ర జరుపుతారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



బలిజాత్రలో పూజలు అందుకునే భీమ, భీమాయిని



ఉమ్మిరి గ్రామంలో బలిజాత్రలో ప్రజలు

విత్తన ఎంపికే కీలకం

- సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు
- 656 రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి చర్యలు
- రైతులకు అందుబాటులో పలు రకాల వరి విత్తనాలు
- జిల్లాలో వరి విస్తీర్ణం 1.78 లక్షల హెక్టార్లు
- అందుబాటులో ఉన్న వరి విత్తనాలు 35,009 క్వింటాళ్లు

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతుంది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. అయితే ఖరీఫ్‌లో విత్తనాల ఎంపికే అన్నింటి కంటే కీలకమని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. ఏ రకం వేస్తే తెగుళ్లను, వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తుందో తెలుసుకుని సాగు చేయాలని సూచిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 5 నెలల కాలపరిమితిలో పంట సాగు చేస్తే ధాన్యం దిగుబడులు చేతికి వస్తాయి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే రైతులకు అందుబాటులోకి రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చి వాటి ద్వారా రైతులకు విశిష్ట సేవలను అందిస్తోంది. వ్యవసాయాన్ని పండగలా చేసుకునే విధంగా ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలతో పాటు రైతులకు కావాల్సిన విత్తనాలను సరఫరా చేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఏ రకం విత్తనాలు కావాలో ముందుగానే ఆర్డర్ చేసుకోవడం వల్ల ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు అందుతున్నాయి. ఇలాంటి సమయంలో రైతులకు నచ్చిన విత్తనాలను ఎంపిక చేసుకునేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పలు సూచనలు చేస్తున్నారు. జిల్లాలోని 30 మండలాల పరిధిలో 1.78 లక్షల హెక్టార్లల్లో వరి సాగవుతోంది. జిల్లాలో ఇప్పటికే 656 రైతు భరోసా కేంద్రాల ద్వారా 35,009 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేసేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు పూర్తి చేసింది. రైతులు తగిన విత్తనాలను ఎంపిక చేసుకుని సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించగలరని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గత మూడేళ్లుగా రైతులు వరిసాగు చేసి ప్రయోగాత్మకంగా వాటి ఫలితాలు రావడంతో వరి విత్తనాల రకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.



రైతుల కోసం సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

అందుబాటులో ఉన్న విత్తనాలు

- ఎంటీయూ 1121 శ్రీ ధృతి రకం పంటకాలం 140–142 రోజులు. ఎకరాకు 28.30 బస్తాల దిగుబడి వస్తుంది. ఆకు ముడత పురుగును తట్టుకునే రకం. • ఎంటీయూ 7029 స్వర్ణ రకం పంటకాలం 150– 152 రోజులు. ఎకరాకు 26.50 బస్తాల దిగుబడి వచ్చినా గింజ పరిమాణం రైతులకు నచ్చడం లేదు.
- బీపీటీ 5204 సాంబమసూరి రకం పంటకాలం 143–145 రోజులు. ఎకరాకు 28.50 బస్తాల దిగుబడి వచ్చినా గింజ నాణ్యత, దిగుబడులు రైతులకు నచ్చడం లేదు.
- ఎంటీయూ 1318 రకం పంట కాలం 155–160 రోజులు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. అధిక పిలకలు వేసి దిగుబడి బాగున్నప్పటికీ అపరాలు చేస్తున్న ప్రాంతానికి అనువుగా లేదు. వరి తర్వాత మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు సాగు చేస్తున్న ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు.
- ఆర్‌జీఎల్ 2537 శ్రీకాకుళం సన్నాలు రకం 160 రోజుల్లో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. మధ్యస్థ సన్న గింజ రకం, 160 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. చేను ఎక్కువగా పడిపోతుంది.
- ఎంటీయూ 1224 మార్టేరు సాంబ రకం 135 రోజుల్లో ఎకరాకు 26 నుంచి 28 బస్తాల దిగుబడి వస్తుంది. పంట చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలం. • బీపీటీ 3291 సోనామసూరి రకం 135 నుంచి 140 రోజుల్లో ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. గింజ సన్నంగా ఉండి, అన్నానికి బాగుంటుంది.
- ఎంటీయూ 1061 ఇంద్ర రకం పంట కాలం 150 రోజులు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. సన్న గింజగా ఉండి తెలుపు రంగులో ఉంటుంది. చేను పడిపోదు. 10 రోజుల వరకు ముంపును, కొద్దిపాటి చౌడును తట్టుకుంటుంది. అన్నానికి అనుకూలం.
- ఎంటీయూ 1064 అమర రకం 150 రోజుల్లో ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. చేను పడిపోదు. గింజ రాలదు. సన్న రకం గింజ. ముంపును బాగా తట్టుకుంటుంది.

జీడి..తగ్గిన దిగుబడి

- ప్రతికూల వాతావరణ పరిస్థితులే కారణం
- జిల్లాలో 55600 ఎకరాల్లో జీడిమామిడి సాగు
- గతేడాది 17వేల టన్నులు రాగా ఈ ఏడాది 10 వేల టన్నులకే పరిమితం
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జీడిమామిడి దిగుబడిపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపించాయి. గతంతో పోల్చితే ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గడంతో జీడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రధానంగా ఉద్దానం ప్రాంతమైన పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేటతో పాటు రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో అధికంగా జీడి సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 55,600 ఎకరాల్లో జీడితోటలు విస్తరించి ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో ఏటా 17వేల టన్నుల వరకు జీడి దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ప్రతికూల పరిస్థితుల కారణంగా 10వేలు టన్నులకే పరిమితమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే జీడిపప్పు ధర మరింతగా పెరుగుతుందని చెబుతున్నారు. ఏటా ఎకరాకు 5 బస్తాల జీడి దిగుబడి వచ్చేది. ఈ ఏడాది మూడు బస్తాలకు పడిపోయింది. ఈ ఏడాది లాభాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నాణ్యతను బట్టి 80 కేజీల బస్తా రూ.8వేలు నుంచి రూ.12 వేలు ధర పలుకుతోంది.

కారణాలు ఇవే..

జిల్లాలో ఉద్యాన పంటలలో అత్యధిక వాణిజ్య విలువలు, య వనరులు సమకూర్చే పంటలలో జీడిమామిడి ప్రధానమైంది. అయితే ఈ సంవత్సరం ప్రతికూల వాతావరణం కారణంగా దిగుబడులు అనుకున్నంత ఆశాజనకంగా లేవు. సకాలంలో వర్షాలు లేకపోవడంతో పాటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంవల్ల మొదటి దశ పూత ఆలస్యమైంది. దీనికి తోడు పూత సమయంలో మంచు అధికంగా పడటంతో పూత, పిందె మాడిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

యాజమాన్య పద్ధతులు ఇలా..

- జీడిమామిడిలో జూన్, జూలై నెలల్లో తొలకరి వర్షాలకు జీడి చెట్ల వరుసల మధ్య కలుపు నివారణకు చెట్ల మొదల నుంచి 1.5 మీటర్లు వదిలి వేర్లకు నష్టం కలగకుండా దున్నుకోవాలి.
- భూసార అభివృద్ధికి వరుసల మధ్య తేలికగా నేలలో కలిసి సులువుగా కుళ్లిపోయే పచ్చిరొట్ట పంటలు వేసుకుని 35 నుంచి 40 రోజులు పెంచి నేలలో కలియదున్నాలి.
- జీడి మామిడిలో లేత తోటల్లో భూమి నుంచి మీటరు ఎత్తు వరకు ఉన్న కింది కొమ్మలను కత్తిరించి ఏపుగా వృత్తాకారంలో పెరిగేలా మొక్కను ట్రైనింగ్ చేయాలి.
- ముదురు తోటల్లో ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎండు కొమ్మలు, భూమికి ఆనుకుని ఉన్న కొమ్మలు, ఇతర చెట్ల మీదకు పోయిన కొమ్మలు, నీడను ఉన్న కొమ్మలను కత్తిరించుకోవాలి. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగినంత సూర్యరశ్మి, వెలుతురు, గాలి సోకి కొమ్మలు, పూత ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుంది.
- వర్షాధారపు తోటల్లో పాదులకు మల్చింగ్ చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి. ఈ నీరు కొత్త చిగురు రావడానికి, త్వరగా మొదలుపెట్టడానికి ఉపయోగపడుతుంది.
- పోషక లోపాలు, సూక్ష్మ పోషక లోపాలుంటే నీటిలో కరిగే పోషక మిశ్రమాలను ఫార్ములా–4 ఐదు గ్రాములు లీటరు నీటికి చెట్టుపై పిచికారి చేసుకోవాలి. చెట్టుకు 1100 గ్రా.యూరియా, 750గ్రా. సింగిల్ సూపర్ ఫాస్పేట్, 200 గ్రా మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌తో పాటు 10 కేజీల కుళ్లిన పశువుల ఎరువుగా అందించాలి.
- ఏడేళ్లపై వయస్సుగల చెట్ల కాండం మొదలు, భూమిపైన కనపడే వేర్లను సన్నని ఇనుప వైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్ది ఆ తరువాత బాగా తడిచేలా 5 శాతం వేప నూనె ద్రావణాన్ని నాలుగు నెలలకు ఒకసారి చొప్పున సంవత్సరంలో మూడు సార్లు పిచికారీ చేయాలి.
- వేప నూనె నీటిలో కరగదు కాబట్టి ప్రతి లీటరు నీటికి 0.5 గ్రాములు సబ్బు కానీ, సర్ఫ్ కానీ కలిపి గిలగకొట్టి 50మి.లీ. వేప నూనెను కలిపి బాగా కలిసేటట్లు పుల్లతో కలియబెట్టాలి.
- ఈ పురుగు ఆశించే చెట్ల నుంచి బంక కారుతూ ఉంటుంది. వెంటనే బెరడు కింద దాగివున్నా లద్దెపురుగులను తొలిగించాలి.
- బెరడు చెక్కిన చోట వెంటనే కార్బరిల్ 4.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగులను తొలగించకపోతే క్రమేపీ చెట్లు చనిపోయే అవకాశం ఉంటుంది. చెక్కిన బెరడు మొక్కలను కాండం నుంచి కారిన బంకను చెక్కపొడిని భూమిలో పాతిపెట్టాలి.
- తోటలను పరిశుభ్రంగా ఉండాలి. తుదిదశలో పురుగులు సోకిన చెట్ల ఆకులు పసుపు రంగుగా మారతాయి. ఆ తర్వాత ఆకులు రాలి మోడువారి ఎండిపోయి చనిపోతాయి. కాబట్టి ఆకులు పూర్తిగా పసుపు రంగుకు మారగానే చెట్లను వెంటనే పేర్లతో సహా తీసివేసి వేర్లలో దాగి ఉన్న ప్యూపాలను చంపి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- టీ దోమ తల్లి పిల్లపురుగులు లేత కొమ్మలను, పూతరెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురుబిందువులు పూతరెమ్మలపై నల్లని పొడవైన కండే ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. పూత, పిందెలు మాడిపోవటం వల్ల దిగుబడి తగ్గుతుంది.
- విపరీత పరిస్థితుల్లో చెట్లంతా మాడిపోయినట్లవుతుంది. డిసెంబర్, మార్చి నెలలో అవసరాన్ని బట్టి రెండు లేక మూడు సార్లు పురుగు మందులను పిచికారి చేసి అన్ని పురుగులను అదుపు చేయవచ్చు.
- మొదటిగా మోనోక్రోటోఫాస్ డిసెంబర్ జనవరిలో (1.4 మి. లీ./లీ.), రెండవసారి ఎండోసల్ఫాన్‌ను జనవరి ఫిబ్రవరిలో (1.4 మి. లీ./లీటరు), మూడవసారి అవసరమైతే కార్బరిలను మార్చిలో (2 గ్రా./లీటరు) పిచికారి చేసి అన్ని రకాల పురుగులను అదుపులోకి తీసుకురావచ్చు. పైమందులు కాక క్లోరిపైరిఫాస్ (2.5 మి. లీ/ లీటరు నీటికి) ప్రొఫెనోఫాస్ (1.0 మి.లీ/లీటరు) నీటికి కూడా వినియోగించవచ్చు.



జీడిమామిడి చెట్టు

ముందస్తు జాగ్రత్తలే మేలు..



జీడిమామిడి పంటదశ ముగిసినప్పటి నుంచే రైతులు యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించాలి. పంట దిగుబడి తగ్గిందని నిరాశ చెందకుండా గతేడాది నష్టాన్ని భర్తీ చేసుకోవాలంటే పంట ప్రారంభ దశ నుంచే ప్రణాళికబద్ధంగా జాగ్రత్తలు పాటించాలి. ఉద్యానవన శాఖ అధికారుల నుంచి తగిన సూచనలు, సలహా తీసుకోవాలి.

–ఆర్.వి ప్రసాద్, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, శ్రీకాకుళం

పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ పోలిస్‌స్టేషన్ పరిధిలో బుధవారం పోక్సో కేసు నమోదైంది. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు తెలిపిన వివరాల మేరకు.. లోపింటి నర్సింహులు రాగోలులో అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఈయన స్వస్థలం జలుమూరు మండలం గొటివాడ. స్థానికంగా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆ గ్రామంలో చదువుతున్న మైనర్ బాలికను కొన్నేళ్లుగా ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాక బాలిక తల్లిదండ్రులతో పాటు శ్రీకాకుళం నగరానికి వచ్చేసింది. అయినప్పటికీ తన వెంట పడుతూ వేధిస్తున్నాడంటూ బాధిత బాలిక రూరల్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు డీఎస్పీ వై.శృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని మండలవీధిలో నివాసముంటున్న ఓ మహిళ తన కుమార్తె అదృశ్యమైందంటూ శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. తన కుమార్తె గొంటివీధిలో ఉన్న ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోందని, రాజమండ్రికి చెందిన పోలరాజుతో పరిచయముందని, అతను తరచూ ప్రేమిస్తున్నానంటూ ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు చేస్తుంటాడని, అతనిపైనే అనుమానముందంటూ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ పేర్కొన్నారు.

1న ఐక్యవేదిక సదస్సు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శి బాజీ పఠాన్ ఆధ్వర్యంలో జూన్ 1న ఐక్యవేదిక సదస్సు నిర్వహించనున్నట్లు స్టీరింగ్ కమిటీ శ్రీకాకుళం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఐక్యవేదిక సమావేశానికి అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

క్లుప్తంగా

రామతీర్థం హుండీల ఆదాయం రూ.27.36 లక్షలు


రామతీర్థంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవా భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.27,36,578 నగదు లభించిందని ఈఓ ఇజ్జిరోతు శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలిపారు. మూడు నెలలకు గాను స్వామి వారి ఆదాయాన్ని లెక్కించామని చెప్పారు. జిల్లాకు చెందిన శ్రీవారి సేవా భక్తులు స్వామివారి హుండీల ఆదాయాన్ని లెక్కించగా..దేవాదాయశాఖ తనిఖీదారు లక్ష్మి లెక్కింపును దగ్గరుండి పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

జూన్1న పర్యావరణంపై విద్యార్థులకు పోటీలు

విజయనగరం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 1న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఒక విభాగం, 8 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు మరో విభాగంలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 1వ తేదీ ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 30, 31 తేదీల్లో గురజాడ గ్రంథాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మన భూమి, మన భవిష్యత్తు, జనరేషన్ పునరుద్ధరణ అన్న అంశాలపై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడి చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతుడు మహేష్(ఫైల్)

వీరఘట్టం: మండలంలోని కంబర గ్రామానికి చెందిన రెడ్డి మహేష్(35) మామిడి చెట్టు కాయలను తెంపేందుకు బుధవారం చెట్టు ఎక్కుతూ కాలు జారి కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మామిడి కాయలు తెస్తానని తమ తోటకు వెళ్లిన భర్త శవమై తిరిగి రావడంతో భార్య, బంధువులు భోరున విలపించారు. మృతుని భార్య సరస్వతి ఫిర్యాదుపై ఏఎస్సై రెల్లయ్య కేసు నమోదు చేసి,మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అగిఉన్న లారీని ఢీకొన్న ఆటో

- ఒకరి మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

బొండపల్లి: అగి ఉన్న లారీని వేగంగా వస్తున్న ఆటో ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఐదుగురు వ్యక్తులను ఆస్పత్రికి తరలిస్తుండగా ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురు తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్నారు. బుధవారం వేకువ జామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాతరలో ఆటవస్తువులు అమ్ముకుని జీవనం సాగించే కొంతమందిని గజపతినగరం నుంచి విశాఖపట్నం తీసుకువెళ్తున్న ఆటో నెలివాడ జంక్షన్ సమీపంలో జాతీయరహదారి26పై ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డొక్కా సూరిబాబు(45) మృతి చెందగా డొక్కా గాయత్రి, కిల్లి రత్నం, కిల్లి రాజేష్, కిల్లి రాజ్యలక్ష్మిలకు తీవ్ర గాయాలు కావడంతో విజయగనరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులు


నూతనంగా ఎన్నికైన సభ్యులతో జిల్లా సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులకు చోటు దక్కింది. విజయవాడలో బుధవారం జరిగిన సంఘం రాష్ట్ర కమిటీ జనరల్ కౌన్సిల్‌లో సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ పైడిరాజు తెలిపారు. నూతన కమిటీలో ఐఎఫ్ఈఏ సభ్యులుగా వై.సత్యం, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా వై.మధుసూదనరావు, ఎస్.వెంకటనాయుడు, ఎన్‌వీ పైడిరాజు, బి.బలరామునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారికి జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ‘పెన్’ నంబర్

- స్కూళ్లలో ప్రవేశాలకు శాశ్వత గుర్తింపు
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు
- టీసీ, కులధ్రువీకరణ పత్రాలకు స్వస్తి


పాఠశాలలో బోధనా తరగతి

విజయనగరం అర్బన్: మరికొన్ని రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటినుంచే ఒక తరగతి నుంచి మరొక తరగతికి వెళ్లే విద్యార్థులు, ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో పిల్లలను చేర్చే పనిలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఒకప్పటి నిబంధనల ప్రకారం ఒక పాఠశాల నుంచి వేరే పాఠశాలలో చేరే విద్యార్థులకు టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. విద్యార్థి నమోదును వదులుకోలేక సదరు పాఠశాలల యాజమాన్యాలు వారికి కావాల్సిన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతుంటాయి. ఈ పరిస్థితులను అధిగమించడానికి జాతీయస్థాయిలో విద్యార్థులకు శాశ్వత గుర్తింపును ఇచ్చే 11 అంకెలతో కూడిన పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) విధానం అమలులోకి వస్తోంది. నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)లో భాగంగా ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచే అమలులోకి తీసుకువస్తోంది. భారతీయ పౌరుడిగా గుర్తింపు పొందడానికి ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఎంత కీలకమో ఇకపై ప్రతి విద్యార్థికి జాతీయస్థాయిలో రూపొందించిన ఈ శాశ్వత గుర్తింపు నంబర్ కీలకం కానుంది. దేశంలోని విద్యార్థులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్యగా 11 అంకెల పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్)ను కేటాయిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడంతో ఇకపై ప్రతి పాఠశాలలో పెన్ నంబర్‌ను తప్పనిసరిగా విద్యార్థులకు అమలు చేయాలని ఇటీవల పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు మినహా మిగతా విద్యార్థులందరికీ పెన్‌నంబర్ తప్పని సరి చేయాలని ఆదేశించారు.

పెన్ నంబర్ కేటాయింపులో నిబంధనలు

గత ఏడాది వరకు పాఠశాలలో ప్రవేశానికి తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. కానీ ఈ విద్యాసంవత్సరం నుంచి ఆ విధానానికి స్వస్తి పలకను న్నారు. ఇప్పుడు 1వ తరగతిలో విద్యార్థులను చేర్చుకునేటప్పుడు అన్ని పత్రా లు డిజిటలైజ్ చేయనున్నారు. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ చేసేటప్పుడు ఎలాంటి పత్రాల కోసం పట్టు బట్టకూడదని నిబంధన లున్నాయి. ఈ ప్రక్రియ కోసం బదిలీ అవుతున్న స్కూల్ నుంచి తెచ్చుకున్న పెన్ నంబర్ /చైల్డ్ ఐడీతోపాటు ఆధార్ నంబర్ సమర్పిస్తే సరిపోతుంది. ఇతర రాష్ట్రాల విద్యార్థుల కోసం మైగ్రేషన్ సర్టిఫికేట్, ఇతర అవసరమైన సర్టి ఫికెట్లను అనుసరించాల్సి ఉంది. అలాంటి విద్యార్థుల డేటా అంతా వారి రాష్ట్రంలోని యూడైస్ పోర్టల్ నుంచి డ్రాప్ చేసి, మన రాష్ట్రంలో మ్యాప్ చేయా ల్సి ఉంది. ఒకటో తరగతిలో నమోదు చేసుకునే సమయంలోనే విద్యార్థులందరికీ డిజీ లాకర్‌ను ప్రతి ఒక్క హెచ్ఎం నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో 2.07 లక్షల విద్యార్థులకు వర్తింపు



జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యాలయాలలోనూ పెన్ నంబర్ విధానం వర్తిసుంది. జిల్లాలో గల 2,235 విద్యాలయాల్లో 2,07,127 మంది విద్యార్థుల నమోదు ఉంది. అత్యధికంగా 1,636 ఎంపీపీ, జెడ్పీ స్కూళ్లలో 94,207మంది విద్యార్థులున్నారు. వారిలో ఎవరు ఎక్కడికి వెళ్లాలనుకున్నా ఈ ఏడాది నుంచి పెన్ నంబర్‌తోనే ఆన్‌లైన్‌లో బదిలీలు చేపడుతున్నాం.

–ఎస్.ప్రేమకుమార్, డీఈఓ

పెన్ నంబర్ వర్తించే విధానం

ఒకటో తరగతి అడ్మిషన్ సమయంలో ప్రతి విద్యార్థికి కేటాయిస్తారు. అది వారి చదువు పూర్తయ్యేంత వరకు కొనసాగుతుంది. విద్యా మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వ యూడైస్ పోర్టల్ ద్వారా విద్యార్థులందరికీ ఈ పెన్ నంబర్‌ను అందిస్తోంది. దీనిని ఎడ్యుకేషన్ ప్రారంభ సంవత్సరంలోనే ఇస్తారు. ఇది జీవితాంతం చెల్లుబాటవుతుంది. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీ డియట్ వరకు విద్యార్థులకు యూనిక్ ఐడీ తరహాలో పెన్ నంబర్‌ను కేటాయిస్తారు. ఈ నంబర్ ద్వారానే విద్యార్థి ఎక్కడ చదివాడో? ఉన్నత చదువులను అప్‌డేట్ చేస్తారు. చదువులు పూర్తయిన అనంతరం వారు ఆ తరువాత ఏ స్థాయిలో ఉన్నారనే విషయాన్ని సులువుగా తెలుసుకోవచ్చు.

పాఠశాలలకు విద్యార్థుల మ్యాపింగ్

విద్యార్థుల బదిలీ ప్రక్రియను సులభతరం చేయడానికి అమలు చేస్తున్న కొత్త తరహా విధానంలో కీలకమైనది పాఠశాలలకు విద్యార్థుల మ్యాపింగ్. తల్లిదండ్రులు ఇచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకోవాలంటే ఆయా పాఠశాలల ట్యాగింగ్ తప్పనిసరి. విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆప్షన్ ఫారం ప్రధానో పాధ్యాయుడు తెప్పించుకుని వాళ్ల లాగిన్‌లో నమోదు చేసుకోవాలి. నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకుని, అటువంటి విద్యార్థులందరినీ మ్యాప్ చేసిన తర్వాత ఆ డేటా రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఎంపిక చేసిన పాఠశాలకు బదిలీ చేస్తారు. ప్రమోషన్ కార్యకలాపాల సమయంలో విద్యార్థులను ఎంపిక చేసుకున్న పాఠశాలలకు బదిలీ చేస్తారు. అన్ని మేనేజ్ మెంట్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ వారి తర్వాతి తరగతిలో చేరేలా పాఠశాలకు ట్యాగ్ చేయాలి.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


సీఎస్‌ఆర్‌పేటలో దొంగిలించిన ట్రాన్స్‌ఫార్మర్

వీరఘట్టం: మండలంలో ఇటీవల కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జోరందుకున్నాయి. పంటపొలాలకు సాగునీరు అందించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. గడిచిన ఆరునెలల్లో మండలంలోని 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించుకుపోయారు. తాజాగా మంగళవారం రాత్రి చిదిమి రోడ్డులో సీఎస్ఆర్ పేట రెవెన్యూ పరిధిలో రైతు నల్లబిల్లి మధు పంట పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ పంపు సెట్లకు కరెంట్ ఉంటుంది. రాత్రి పూట ఈ లైన్‌కు కరెంట్ ఉండదు.పంట పొలాల్లో రాత్రి పూట ఎవరూ ఉండకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి వాటిని కాపర్‌వైర్లను పట్టుకుని పోతున్నారు. గతేడాది డిసెంబర్ 23న సీఎస్ఆర్ పేట వద్ద నల్లబిల్లి అంబరీసు, కర్నాకుల మన్మథరావుల ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించారు.ఈ ఏడాది మార్చి 25న ఇదే ప్రాంతంలో గడగమ్మ ఈశ్వరమ్మ, పడాల కృష్ణమూర్తిలకు చెందిన మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనానికి గురయ్యాయి. వరుసగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈ దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు. దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను రాజాంలో పట్టుకున్న ఎస్ఈబీ సీఐ శ్రీధర్ తదితరులు

రాజాం సిటీ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ బుధవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడిచేసి రేగిడి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ట్రాక్టర్, రాజాం టౌన్‌లో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. 13.5 టన్నుల ఇసుకతోపాటు మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు అప్పగించామని తెలిపారు. ఎస్ఈబీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని టౌన్ సీఐ డి.మోహనరావు తెలిపారు.

ఉంగరం కాజేసిన నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: వృద్ధుడిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి చేతికి ఉన్న బంగారు ఉంగరం, జేబులో ఉన్న నగదు లాక్కుని వెళ్లిపోయిన ఆటోడ్రైవర్‌ను వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక చల్లపేట గ్రామం నుంచి నడుచుకుంటూ వెళ్తున్న తనను ఒక ఆటో డ్రైవర్ ఎక్కించుకుని, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకు వెళ్లి, చేతికి ఉన్న బంగారు ఉంగరం, రూ.1500 నగదు బలవంతంగా లాక్కున్నట్లు కోళ్ల బుచ్చయ్య చౌదరి అనే వృద్ధుడు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన క్రైమ్ ఎస్సై తారకేశ్వరరావు, వన్‌టౌన్ క్రైమ్ పోలీసులు ఆటో నంబర్ ఆధారంగా నేరానికి పాల్పడిన నిందితుడిని పాత నేరస్తుడైన గజపతినగరం మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన తాడ్డి రవిగా గుర్తించారు. స్థానిక కలెక్టరేట్ జంక్షన్ వద్ద ఆదివారం ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఉంగరాన్ని రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించారు.

రోగులకు చికిత్స త్వరగా ప్రారంభించాలి

- 108 జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్


శిక్షణకు హాజరైన ఈఎంటీలతో నజీర్ హుస్సేన్

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న రోగికి వెంటనే చికిత్స ప్రారంభించాలని108 జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్ సూచించారు. ఈ మేరకు స్థానిక 108 సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన 108లో పనిచేస్తున్న ఈఎంటీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడు తూ రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చడం వల్ల ప్రాణాలు కాపాడ వచ్చన్నారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలని స్పష్టం చేశారు. గుండెజబ్బులు వచ్చినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఓజేటీ ఎ. శ్రీనివాసరావు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ సాయి షణ్ముఖ, రవికుమార్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి, సహాయ కమిషనర్ కె. రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కార్మికశాఖ, ఇతర ప్రభుత్వశాఖలు సంయుక్తంగా జిల్లాలో జూన్ 1వ తేదీ నుంచి జూన్ 30 వ తేదీ వరకు చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 14 సంవత్సరాల వయస్సు లోబడిన పిల్లలు షాప్స్, సంస్థలు, వాణిజ్య సంస్థలు, హోటల్స్, సినిమా హాల్, మెకానిక్ షెడ్స్, రెడీమేడ్ దుకాణాలు, కిరాణా షాప్స్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, వెల్డింగ్ షాప్స్, తోపుడు బండ్లు, మోటార్ రవాణా వంటి ప్రమాద రహిత ప్రదేశాల్లో పని చేయరాదని, ప్రమాదకరమైన ప్రదేశాల్లో 18 సంవత్సరాల లోపు బాలబాలికలను పనిలో పెట్టుకోకూడదని స్పష్టం చేశారు. కార్మికశాఖ చట్టాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా బాలబాలికలు పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తిస్తే అందుకు కారణమైన సదరు యాజమాన్యంపై బాల కార్మికుల చట్టం 1986 అనుసరించి తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా మార్చడమే కార్మికశాఖ ముఖ్యఉద్దేశమని చెప్పారు.

వారణాశిలో బొబ్బిలి వాసి బంగారం చోరీ

బొబ్బిలి: పట్టణానికి చెందిన గొట్టాపు త్రినాథరావు కుటుంబసభ్యులు పుణ్యక్షేత్రాలకు వెళ్లి బంగారం పోగొట్టుకున్నారు. ఈనెల 14న వారణాశి తదితర ప్రాంతాల సందర్శనకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో వారణాశిలోని రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై త్రినాథరావు భార్య మెడలోని పుస్తెల తాడు దొంగతనానికి గురైంది. వెంటనే అక్కడి జీఆర్‌పీ అధికారులకు ఫిర్యాదు చేయగా చాకచక్యంగా నిందితులను పట్టుకున్నప్పటికీ బంగారాన్ని తమకు ఇవ్వలేదని బాధితులు చెబుతున్నారు.

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు ఉండాలి


కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి
- లెక్కింపు కేంద్రాల పరిశీలన

విజయనగరం అర్బన్: ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీ గా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. లెండి ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ జీవీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆమె బుధవారం పరిశీలించారు. ప్రతి నియోజకవర్గ లెక్కింపు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, సిబ్బంది కూర్చునే విధానం, ఏజెంట్లకు చేసిన ఏర్పాట్లు, ఆర్‌ఓలు, అబ్జర్వర్ల సీటింగ్ ఏర్పాట్లు, వీవీప్యాట్‌ల లెక్కింపు గదులు, టాబ్యులేషన్, ఎన్‌కోర్, ఫలితాలు రాసేందుకు బోర్డులు, లెక్కింపు కేంద్రాలకు చేరుకునేందుకు ఏర్పాటుచేసిన మార్గ సూచికలు, బారికేడ్లను పరిశీలించారు. ఏజెంట్లు, సిబ్బంది వచ్చి వెళ్లేందుకు రెండు వేర్వేరు మార్గాలు ఉండాలని స్పష్టం చేశారు. తాగునీరు, టీ తదితర పానీయాలను లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించేది లేదని, వాటిని గదుల బయటే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలను నేరుగా లెక్కింపు కేంద్రాలకు తీసుకువచ్చే మార్గాన్ని పరిశీంచారు. రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేస్తూ కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, వేదికల ఇన్‌చార్జ్‌లు, నోడల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి రామారావు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి కె.టి.రామారావు

చీపురుపల్లి: ఖరీఫ్ సీజన్ ఆసన్నమైన తరుణంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి కె.టి.రామారావు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయశాఖ సబ్ డివిజినల్ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని ఎరువుల దుకాణాల డీలర్లు, వ్యవసాయశాఖ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల దుకాణాల డీలర్లందరూ నిబంధనలు పాటించాలన్నారు. విత్తనాలు, పురుగు మందులు బ్లాక్‌చేసి ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయించి రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు. విత్తనాలకు సంబంధించి డీలర్లు ముందుగా మొలక శాతం ధ్రువీకరించిన తర్వాత మాత్రమే విక్రయించాలన్నారు. ఎరువులు దుకాణాలు ఎమ్మార్పీ ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లోని రైతుభరోసా కేంద్రాల సిబ్బంది ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎస్.కోటీశ్వరరావు, అన్నపూర్ణ, ఏఓ సీహెచ్.రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

గురుదేవా ట్రస్టు సేవలు ఆదర్శప్రాయం

- ఎస్ఏఎల్‌పీజీ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ ముఖేష్


దివ్యాంగుడికి కృత్రిమ కాలు తొడుగుతున్న ఎస్ఏఎల్‌పీజీ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ ముఖేష్

కొత్తవలస: దివ్యాంగులకు మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని ఎస్ఏఎల్‌పీజీ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ ముఖేష్ అన్నారు. ట్రస్టును ఆయన బుధవారం సందర్శించారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తన జీవితాన్ని దివ్యాంగుల సేవకే అంకితం చేశారని కొనియాడారు. దేశంలో ఎక్కడా దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు అందించే సంస్థలు లేవన్నారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి జగదీష్ బాబు సొంత ఆస్తులను కరగబట్టి దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను అందించి వారికి చేదోడు నిలుస్తుండడం అభినందనీయమన్నారు. ముందుగా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం 20 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, చెవిటిమిషన్లు, పోలియో కాలిపర్స్ అందజేవారు. మరో 50 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఏఎల్‌పీజీ సీఈఓ వికాస్‌వర్మ, సీఎస్‌ఆర్ హెడ్ రామనాథ్, ట్రస్టు వైస్ చైర్మన్ డా.ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన చికెన్ ధరలు

- స్కిన్ రూ.300, స్కిన్‌లెస్ రూ.320
- వేసవి ఉష్ణోగ్రతలతో తగ్గిన కోళ్ల ఉత్పత్తి
- ధరల పెరుగుదలతో బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు



రామభద్రపురం: చికెన్ ధరలు అమాంతం పెరగడంతో మాంసాహార ప్రియులు ఆందోళన చెందుతున్నారు. మాంసం విక్రయదారులు చికెన్ ధర పెంచి విక్రయిస్తుండడంతో కొనుగోలు దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి నేపథ్యంలో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో ఆ వేడికి బ్రాయిలర్ కోళ్లు చనిపోవడం, దాణాను తీసుకునేందుకు కోళ్లు ఇష్టపడకపోవడంతో అవి బరువు పెరగడం లేదని, వీటి కారణంగా ధరలు పెరుగుతున్నాయని ఫౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. మరోవైపు లైవ్ కోడి కిలో రూ.180 వరకు ధర పలుకుతుండగా, దీనికితోడు కోడిగుడ్డు ధర కూడా రూ.7కు చేరుకుంది. వేసవి వేడి కారణంగానే కోళ్లు, గుడ్లు ఉత్పత్తి గణనీయంగా తగ్గుతోందని, రోజురోజుకూ పెరుగుతున్న ఎండలకు చాలా కోళ్లు చనిపోతున్నాయని కోళ్లఫారం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ముగిసే సరికి ఇప్పుడున్న కిలో చికెన్ ధర మరో రూ.50 వరకు పెరుగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆకాశాన్నంటుతున్న చికెన్ ధరలు చూసి, కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. లేయర్స్(గడ్లు పెట్టే కోళ్లు) విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలకు లేయర్ కోళ్లు గుడ్లు అంతగా పెట్టడం లేదు. దీంతో కోడిగుడ్ల ధర కూడా విపరీతంగా పెరిగిపోతోంది. ప్రస్తుతం 100 కోడిగుడ్ల ధర రూ.500 నుంచి రూ.550 వరకు ఉంటోంది. దుకాణాల వద్ద ఒక్కో గుడ్డు రూ.6 నుంచి రూ.7 వరకు విక్రయిస్తున్నారు. కనీసం గుడ్డు తినేందుకు కూడా సామాన్య మధ్యతరగతి ప్రజలు భయపడుతున్నారు. ఇంత ధర అయితే ఎలా కొనుగోలు చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎయిమ్స్ డీఎం ప్రవేశ పరీక్షలో శ్వేతకు ఫస్ట్‌ర్యాంకు


గుణుపూరు గాయత్రి శ్వేత

విజయనగరం అర్బన్: ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) డీఎం కోర్సుల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ (ఐఎన్ఐ) నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పట్టణానికి చెందిన గుణుపూరు గాయత్రి శ్వేత ఫస్ట్ ర్యాంక్ సాధించింది. డీఎం కోర్సులలోని రీప్రొడక్టివ్ మెడిసిన్ విభాగంలో ఉన్న ఒకే ఒక డీఎం సీటును 76.667/100 మార్కులతో సొంతం చేసుకుంది. ఆమె ఎయిమ్స్ ఢిల్లీలో గైనకాలజీ విభాగంలో ఇటీవల పీజీ పూర్తి చేశారు. విశాఖలోని ఆంధ్రమెడికల్ కళాశాలో చదివిన ఎంబీబీఎస్ డిగ్రీలో 5 గోల్డ్ మెడల్స్ సాధించి కళాశాల 25 సంవత్సరాల చరిత్రను అప్పట్లో తిరగరాశారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యను విజయనగరం పట్టణంలోనే అభ్యసించారు. తండ్రి సత్యం నాయుడు పంచాయతీ రాజ్‌శాఖ (శ్రీకాకుళం)లో డీఈగా పనిచేస్తుండగా, తల్లి రమణమ్మ అడ్వకేట్ వృత్తిలో కొనసాగుతున్నారు. పట్టణంలో స్థిరపడిన వారి స్వగ్రామం సీతానగరం మండలం కృష్ణరాయిపురం. చదువులో ప్రతిభ చూపిన గాయత్రి శ్వేతకు పలువురు అభినందనలు తెలిపారు.